పెట్టుబడి సాయమేది.. బాబూ ?

- ఆర్థిక ఇబ్బందుల్లో అన్నదాత
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

చింతలపూడి/బుట్టాయగూడెం: అన్నదాత పథకంలో రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడు అందిస్తారు సీఎం చంద్రబాబూ అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. అన్నదాత పథకం కింద ప్రతి రైతుకూ సంవత్సరానికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందజేస్తామని చెప్పారు. ఒక పక్క ఖరీఫ్ సీజన్ ముగిసి పోయి రబీ సీజన్ ప్రారంభం అవుతున్నా ఇంత వరకు రైతులకు అన్నదాత పథకం అమలు చేయలేదు. చింతలపూడి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కింద 45,313 మంది రైతులకు ఏటా రూ.61.17 కోట్ల పెట్టుబడి సాయం అందేది. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు రైతులకు పెట్టుబడి సాయం అందకుండా పోయింది. నియోజకవర్గంలో 24,608 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. అత్యధికంగా చింతలపూడి మండలంలో 13,174 ఎకరాల్లో, జంగారెడ్డిగూడెం మండలంలో 11,200 ఎకరాలు, లింగపాలెం మండలంలో 6,473 ఎకరాలు, కామవరపుకోట మండలంలో 33,676 ఎకరాల్లో సాగు చేశారు. సుమారు 77,600 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇంకా ఖరీఫ్ వరి మాసూళ్లు జరుగుతూనే ఉన్నాయి.

పోలవరం నియోజకవర్గంలో 24247 ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, పోలవరం ఏడు మండలాల పరిధిలో



ధాన్యం ఆరబెడుతున్న రైతులు(ఫైల్)

సుమారు 24247 ఎకరాల్లో రైతులు వరి పంట వేసినట్లు అధికారులు తెలిపారు. బుట్టాయగూడెం మండలంలో 3561 ఎకరాలు, జీలుగుమిల్లి 3020 ఎకరాలు, పోలవరం 6569 ఎకరాలు, కొయ్యలగూడెం 6584 ఎకరాలు, కుక్కునూరు 858 ఎకరాలు, వేలేరుపాడు 1255 ఎకరాలు, టి.నర్సాపురం 2400 ఎకరాల్లో రైతులు వరి పంటలను వేశారు. ప్రస్తుతం యంత్రాలతో వరికోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ఇప్పటివరకూ బుట్టాయగూడెం మండలంలో ఐదు కొనుగోలు కేంద్రాల పరిధిలో 59 మంది రైతుల నుంచి 660.64 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే వేలేరుపాడు మండలం మేడేపల్లిలో 68 మంది రైతులు 4760 క్వింటాలు, రామవరంలో 22 మంది రైతులు 1840 క్వింటాల ధాన్యాన్ని విక్రయించారని తెలిపారు. అదే విధంగా జీలుగుమిల్లి మండలంలోని అంకన్నగూడెం, ములగలంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 170 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అలాగే కొయ్యలగూడెం మండలంలో 3183.760 మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే రబీ సీజన్ వచ్చినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్‌లో పండించిన ధాన్యం పంటకు కనీసం పెట్టుబడి ధర కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనాలి



తేమ శాతంతో సంబంధం లేకుండ రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలి. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలి. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి రైతుకూ రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది.

–కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, చింతలపూడి

రైతులను నట్టేట ముంచిన చంద్రబాబు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలా ఆదుకున్నారు. రైతు భరోసా పథకంలో పంటలకు పెట్టుబడి సాయం అందించి ఎటువంటి కష్టం కలుగకుండా చూశారు. అలాగే దళారుల బారిన పడకుండా పంటలకు గిట్టుబాటు ధర కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు రైతులను నట్టేట ముంచారు. రైతులకు ఎటువంటి సహాయం అందించకపోగా కనీసం ధాన్యం కొనే పరిస్థితి లేకుండా చేశారు. దీంతో రైతులు అనేక అవస్థలు పడుతున్నారు.

–తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

బకాయి వేతనాలు విడుదల చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

జంగారెడ్డిగూడెం: పాఠశాలలో ప్రభుత్వం నియమించిన స్వీపర్లకు, ఆయాలకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, స్వీపర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 16 వ తేదీన మిడ్ డే మీల్స్ డైరెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం మండలం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచే వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎన్‌యూజే నేతలు



శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జాతీయ జర్నలిస్టు సంఘ నేతలు

ద్వారకాతిరుమల: విజయవాడలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన నేషనల్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్‌యూజే) నేతలు గురువారం ద్వారకాతిరుమల క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆదేశాల మేరకు ఆలయ అధికారులు ఎన్‌యూజే నేతలకు స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్‌యూజే జాతీయ అధ్యక్షుడు రాస్ బిహారి, ఉపాధ్యక్షుడు శివకుమార్, రాణా, జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీవీఎస్ఆర్ పున్నంరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.యుగంధర్ రెడ్డి, జాప్ ట్రస్ట్ చైర్మన్ పి.సుభాష్ బాబు, సీనియర్ నేత డి.వెంకా రెడ్డి తదితరులున్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ట్రైనింగ్ మేనేజర్ ప్రసంగరాజు

బుట్టాయగూడెం: క్షేత్రస్థాయి సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పని చేయాలని ఏలూరు డీపీఆర్‌సీ జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగరాజు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, మండల అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగరాజు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాయన్నారు. పథకాలకు అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చే విధంగా గ్రామ పంచాయతీలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. జ్యోతి, వెలుగు ఏపీఎం ఎస్‌వివి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ప్యాకేజీలో నిర్లక్ష్యం

కుక్కునూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణానికి ఇచ్చిన ప్రాధాన్యత నిర్వాసితులకు ప్యాకేజీ అందించడంలో ఇవ్వడం లేదని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ విమర్శించారు. గురువారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మారేడుబాక, లంకాలపల్లి, కొత్త నెమలిపేట, కొత్త గుండుగూడెం గ్రామాల్లో గ్రామ శాఖ కమిటీల సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి సోయం చ్రందరావు, ఎం.దేవయ్య, ఎం.రాజు, మంగయ్య జోగయ్య, మహేష్, శిరమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం: జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం సమీపంలో సుంకం చెల్లించని 15 తెలంగాణ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్, డిస్ట్రిక్ట్ పొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు గురువారం అంకంపాలెం సమీపంలో దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ఒక మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో తొమ్మిది శాఖల మండల స్థాయి అధికారులకు అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. డీపీఆర్సీ మేనేజర్ ప్రసంగి రాజు, శాఖల వారీగా నిధుల కేటాయింపు, కేటాయించిన నిధులను వినియోగం వంటి అంశాలపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఈఓపీఆర్డీ చక్రధరరావు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి వితరణ

జంగారెడ్డిగూడెం: చార్టెడ్ అకౌంటెంట్, రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గురువారం కాలిన గాయాలతో బాధపడుతున్న చిన్నారి వైద్యానికి ఆయన రూ.50 వేలు వితరణ చేశారు. టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడానికి చెందిన బొల్లా సాయి కుమార్తె ఇటీవల ఇంట్లో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఉడుకుతున్న అన్నంకుండలో చేయి పెట్టడంతో తీవ్రంగా గాయపడింది. చిన్నారికి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స చేయించడానికి సాయి ఇబ్బందులు పడుతున్న విషయం దాకారపు కృష్ణ దృష్టికి రావడంతో స్పందించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

చింతలపూడి: రెవెన్యూ సదస్సుల ద్వార భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర అన్నారు. గురువారం చింతలపూడి మండలం, చింతంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సులో పాల్గొన్న తహశీల్దార్ ప్రమద్వర మాట్లాడుతూ ప్రజలు తమ భూములకి సంభందించి రెవెన్యూ రికార్డు ల్లో ఏమైనా తప్పులు ఉన్నా, సర్వే, రీ సర్వే,పుంత దారి ఆక్రమణలు, తదితర సమస్యలు ఉన్నా రెవెన్యూ సదస్సులు ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు, కిరణ్ కుమార్, డి.శ్రీనివాసరావు, జి.రవి, సీహెచ్ సత్యనారాయణ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

భూములకు హద్దులు చూపాలి

బుట్టాయగూడెం: తమ భూములకు రీసర్వే చేసి హద్దులు చూపించే విధంగా కృషి చేయాలని కొండరెడ్డి గిరిజనులు రెవెన్యూ అధికారులను కోరారు. మండలంలోని అలివేరు పంచాయతీ పరిధిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గల రేపల్లె, రేగులపాడు, లంకపాకల, అలివేరు గ్రామాల్లో గిరిజనులు సాగు చేసుకుంటున్న వాటికి సరైన సరిహద్దులు లేవన్నారు. ఎవరికి ఏ భూమి చెందుతుందో రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కారం లక్ష్మి, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజులు, గ్రామస్తులు కారం వాసు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి: సమస్యను అధికారులకు వివరిస్తున్న గ్రామస్తులు

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం రూరల్: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని జంగారెడ్డిగూడెం తహశిల్దార్ స్లీవజోజి అన్నారు. మండలంలోని లక్కవరంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెల్లా వెంకట రమణ, బీజేపీ నాయకులు విజ్జు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

వైఎస్సార్‌సీపీ నేతలకు వైఎస్ జగన్ సూచన

లింగపాలెం: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వంతో పోరాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పని చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు లింగపాలెం మండల మాజీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముసునూరి వెంకటేశ్వరరావు తెలిపారు. చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు ఆధ్వర్యంలో తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ అండగా ఉందని తెలియజేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన పథకాలను అమలు చేయకుండా తప్పించుకుంటే ప్రశ్నించేలా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పని చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు ముసునూరు వెంకటేశ్వరరావు తెలిపారు.



లింగపాలెం: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, మండలం వైస్ ఎంపీపీ మట్టా సురేష్, నాయకులు చల్లా గంగాధర్ మర్యాద పూర్వకంగా కలిశారు.

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన నేతలు

చింతలపూడి: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి గురువారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ధీటుగా ఎదుర్కోవాలని సూచించినట్లు జ్ఞానారెడ్డి తెలిపారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దినేష్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల దినేష్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 13వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించినట్లు దినేష్‌రెడ్డి తెలిపారు.



వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.దినేష్‌రెడ్డి, షేక్ మేరా సాహెబ్

కార్యకర్తలకు అండగా ఉంటాం

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపినట్లు మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ మీరా సాహెబ్ తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అధినేతను కలిసినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు బాలరాజు పరామర్శ



బుట్టాయగూడెం: మహాలక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు



కొయ్యలగూడెం: మాజీ సర్పంచ్ రామారావుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నక్కా శివాజీని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం పరామర్శించారు. శివాజీ తండ్రి నక్కా మహలక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బాలరాజు శివాజీని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే తండ్రి మహలక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్ బన్నే బుచ్చిరాజు, నాయకులు దొండపాటి బాలు, తగరం వెంకటేష్, పెద్దలు ఉండ్రాజవరపు పెంటయ్య, చిడిపి గంగాధరరావు, మర్రి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

కొయ్యలగూడెం: వేదాంతపురం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ దండాబత్తుల రామారావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం పరామర్శించారు. ఇటీవల రామారావు మృతి చెందడంతో ఆయన రామారావు చిత్రపటానికి నివాళులర్పించారు. రామారావు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

హనుమద్ కల్యాణోత్సవాలు

కొయ్యలగూడెం: హనుమద్ కల్యాణ వ్రత మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి మండల వ్యాప్తంగా ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు దాస, రామ, భక్త అంజనేయస్వామి ఆలయాలలో అందుకు తగిన ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

సభను జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం: 13న నూజివీడులో జరిగే మంద కృష్ణ మాదిగ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర నేత, పోల వరం నియోజకవర్గ పరిశీలకులు విస్సంపల్లి సిద్దు పిలుపునిచ్చారు.గురువారం తుట్టి ఈశ్వరావు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు.

డిప్యూటేషన్లు రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

బుట్టాయగూడెం: జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న 56 మంది ఎస్‌జీటీలు, సీఆర్‌టీలను కర్నూలు, చిత్తూరు జిల్లాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలకు సర్దుబాటు పేరుతో డిప్యూటేషన్లు వేయడం దారుణమని ఐటీడీఏ టీచర్స్ జేఏసీ కన్వీనర్ మొడియం గంగరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జేఏసీ తరఫున పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లాలకు డిప్యూటేషన్ వేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, వైఎస్సార్‌టీపీ నాయకులు కొమరం అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ల వద్ద ఆందోళనను విజయవంతం చేయండి

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఏలూరులో పార్టీ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి చింతలపూడి నియోజకవర్గ నుంచి రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు పిలుపునిచ్చారు. లింగపాలెంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బీవీఎస్ రెడ్డి గెస్ట్‌హౌస్ నందు పార్టీ నేతలతో కలిసి విజయరాజు రైతుల సమస్యలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆరు నెలల కాలంలో దగాపడ్డ రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటాలు సాగిస్తుందన్నారు. ఎన్నికల వేళ రైతులకు అనేక హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు పూర్తిగా ముఖం చాటేసిందని విమర్శించారు. ఈ కష్ట కాలంలో రైతులకు అండగా నిలవడానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఏలూరులో ఉదయం పది గంటలకు ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి అధిక సంఖ్యలో రైతులతో ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వెళ్లి వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షురాలు జగ్గవరపు జానకి రెడ్డి, లింగపాలెం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొటారి మోహన్, లింగపాలెం సొసైటీ మాజీ చైర్మన్ భీమిరెడ్డి సోమిరెడ్డి, వైసీపీ నాయకుడు గోలి సత్యనారాయణ రెడ్డి, చిట్టిబాబు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



లింగపాలెం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చింతలపూడి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు

చింతలపూడి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం రైతులకు అండగా రైతు సమస్యలపై జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పిలుపునిచ్చారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు గృహంలో మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు రైతులకు అండగా పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రైతులకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగే కార్యక్రమంలో నియోజకవర్గంలోని రైతులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్, బొడ్డు వెంకటేశ్వరరావు, నరశింహారెడ్డి, బి.చెంచమరాజు, మిరియాల దిలీప్,ఎస్ కాంతారావు, ఎ.సుబ్బారావు, ఎన్.దుర్గారావు, తదతరులు పాల్గొన్నారు.